

మరో 3 రోజులు వర్షాలే

నేటి నుంచి మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. 8లో



చీనీ టన్ను రూ.34,120

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34.120 పలికాయి.



జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

బలవంతపు భూ సేకరణపై ఆగ్రహం

- వ్యవసాయం వీడితే వలసలే గతి
- తమ భూములను వదిలేయాలని రైతుల వేడుకోలు



ధర్నా చేస్తున్న రైతులు, వ్యవసాయ కార్మిక, రైతు సంఘం నాయకులు

లేపాక్షి/ హిందూపురం: పరిశ్రమల స్థాపన కోసం వ్యవసాయ భూములను లాగేసుకోవడం తగదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతంగా భూసేకరణ చేయడాన్ని నిరసిస్తూ కొండూరు, తిమ్మగానిపల్లి, వడ్డిపల్లి గ్రామాల రైతులు వ్యవసాయ కార్మిక, రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు భూములు లాగేసుకుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలతో పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నామని తెలిపారు. భూములు కోల్పోతే జీవనం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. తమ భూములను తమకు వదిలేయాలని అధికారులను వేడుకున్నారు. అలాగే హిందూపురం మండలం చలివెందుల, రాచపల్లి మలుగూరు, మీనకుంటపల్లిలో బలవంతపు భూసేకరణ ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఓపీడీఆర్ నాయకులు, రైతులు ర్యాలీగా వెళ్లి హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఏడాదికి మూడు పంటలు పండే 2,191 ఎకరాల భూములను స్వాధీనం చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని రైతులు మండిపడ్డారు. తమ ప్రమేయం లేకుండానే భూములు సర్వే చేయడం ఏమిటని నిలదీశారు. నాయకులు మాట్లాడుతూ బడా బాబులకు, అదాని, అంబానీ కంపెనీలకు ధారాదత్తం చేయడం కోసమే భూములను సేకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో పారిశ్రామిక వాడ కోసం భూములు సేకరించారని, అందులో ఎన్ని పరిశ్రమలు స్థాపించారంటూ ప్రశ్నించారు. హిందూపురం తహసీల్దార్ వెంకటేశులు స్పందిస్తూ రైతుల అనుమతి లేకుండా భూములను తీసుకోబోమని స్పష్టం చేశారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేసి చక్కటి ఫలితాలు సాధించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ 224 అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, ఇళ్లు, స్థలాలు, భూ సమస్యలు తదితర వాటిపై ఎక్కువగా అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డీఆర్‌ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అర్జీల పరిష్కారంలో ఫలితాలు సాధించాలన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని కలెక్టర్ చేతన్ కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర షెడ్యూల్స్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 28న పుట్టపర్తి, జూన్ 4న కదిరి, జూన్ 6న ధర్మవరం, జూన్ 15న పెనుకొండ, జూన్ 13న హిందూపురంలో టీచర్స్–స్టూడెంట్స్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించాలన్నారు. జూన్ 21న లేపాక్షిలో జిల్లా స్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టు పరిశ్రమల శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్‌కుమార్, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, డీఎంహెచ్‌ఓ ఫెరోజాబేగం, సాంఘిక సంక్షేమ శాఖ ప్రతినిధి శివరంగ ప్రసాద్, డీపీఓ సమత, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, డీఎఫ్‌ఓ చక్రపాణి, సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, క్రీడల శాఖ అధికారి ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

ఇక.. పరేషన్

కూటమి సర్కారు ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో వరుసగా షాక్‌లు ఇస్తోంది. రేషన్ సరుకులను భారీగా కుదించి పేదల పొట్ట కొట్టింది. బియ్యం మాత్రమే అందిస్తోంది. ఇక దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్య పీడితులతో పాటు కార్డుదారులకు సౌలభ్యంగా ఉన్న ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసింది. తిరిగి పాత పద్ధతి తీసుకొచ్చింది. జూన్ ఒకటో తేదీ నుంచి చౌకధాన్యపు డిపో (స్టోర్)ల వద్దనే రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు తీసుకుంది.



తనకల్లులో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఇంటింటికీ రేషన్ విధానం రద్దు

- ఉపాధి కోల్పోయిన 'ఎండీయూ' ఆపరేటర్లు
- జూన్ 1 నుంచి చౌకడిపో వద్దే రేషన్ పంపిణీ
- మారుమూల ప్రాంతాల ప్రజలకు తప్పని ఇక్కట్లు

ప్రశాంతి నిలయం: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానానికి కూటమి సర్కారు మంగళం పాడింది. ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదని సాకు చూపి ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 1,367 ప్రభుత్వ చౌకధాన్యపు దుకాణాల పరిధిలో వివిధ కేటగిరీలలో 5,66,971 రైస్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 16,89,531 మంది లబ్ధి పొందేవారు. 2021 నుంచి 349 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ అందించారు. దూరాభారంతో పాటు వ్యయప్రయాసలు తగ్గడంతో కార్డుదారులు సంతోషించారు. ప్రస్తుత కూటమి సర్కారు నిర్ణయంతో ఇంటి వద్దనే రేషన్ పొందే అవకాశాన్ని కార్డుదారులు కోల్పోయారు. ఇక నుంచి స్టోర్ వద్దకే కార్డుదారులు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో ఇంటివద్దకే వచ్చే రేషన్ సరుకులను కూటమి సర్కారు నిలిపివేయడంపై మండిపడుతున్నారు.

రోడ్డున పడ్డ ఎండీయూ ఆపరేటర్లు

జిల్లా వ్యాప్తంగా ఇంటివద్దకే రేషన్ సరుకులు తీసుకొచ్చే ఎండీయూ వాహనాలు 349 ఉన్నాయి. ప్రతి వాహనానికీ ఒక ఆపరేటర్, ఒక హెల్పర్ ఉన్నారు. ఈ లెక్క ప్రకారం 349 మంది ఆపరేటర్లు, 349 మంది హెల్పర్లు ఉపాధి పొందుతున్నారు. వాహనం నిర్వహణకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.21వేలు చెల్లించేది. ఇందులో రూ.3 వేల వాహనం కంతు, రూ.3 వేలు పెట్రోల్, రూ.5 వేలు హెల్పర్‌కు ఇస్తారు. మిగిలిన రూ.10 వేలు ఆపరేటర్ వేతనంగా తీసుకునేవారు. ఈ క్రమంలో ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఆపరేటర్లు ,హెల్పర్‌లు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఇంటింటికీ ఉద్యోగం కల్పిస్తామన్న కూటమి నాయకులు.. హామీని అమలు చేయకుండా తమ ఉద్యోగాలు ఊడగొట్టి రోడ్డున పడేసిందని ఆపరేటర్లు, హెల్పర్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా గణాంకాలు

చౌకధాన్యపు డిపోలు	1,367
బియ్యం కార్డులు	5,66,971

ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీని రద్దు చేయడం దుర్మార్గం. ప్రజలు ఎండీయూ వాహనాల ద్వారా ఎంతో సౌకర్యవంతంగా రేషన్ పొందేవారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తిరిగి స్టోర్ డీలర్ల వద్దకు వెళ్లి రేషన్ పొందాలి అంటే ప్రజలకు తిప్పలు తప్పవు,డీలర్ల ద్వారా అవినీతి పెరిగిపోయే అవకాశం ఉంది.

– మాతంగి తిప్పన్న, మున్సిపల్ వైస్ చైర్మన్, పుట్టపర్తి

మా పొట్ట కొట్టడం దుర్మార్గం



ఎండీయూ వాహనాన్ని నడుపుకుంటూ రూ.10 వేలు సంపాదిస్తూ జీవనోపాధి పొందేవాడిని. ఈ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో పని కోల్పోయాం. ఉద్యోగావకాశాలు కల్పించడం పోయి ఎండీయూ వాహనాలతో ఉపాధి పొందుతున్న మా పొట్ట కొట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి.. మమ్మల్ని ఆదుకోవాలి.

– నరసింహులు, ఎండీయూ ఆపరేటర్, కొడపగానిపల్లి, కొత్తచెరువు మండలం

జవాన్ భూమి కబ్జా

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు



జవాన్ చౌడేష్

ప్రశాంతి నిలయం: దేశ భద్రత కోసం సరిహద్దులో పహారా కాస్తున్న జవాన్ భూమిని కొందరు కబ్జా చేశారు. మూడేళ్లవుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గోరంట్ల మండలం పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లికి చెందిన చౌడేష్ భారత సైన్యంలో పనిచేస్తున్నారు. ఈయనకు రాగిమేకల పల్లి రెవెన్యూ గ్రామ ఎల్‌పీఎం నంబర్ 72లో 4.92 ఎకరాల పొలం ఉంది. మూడేళ్ల క్రితం ఇదే ప్రాంతానికి చెందిన కొందరు ఈ భూమిని కబ్జా చేశారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అంతేకాదు ప్రశ్నిస్తే కబ్జాదారులు జవాన్ తల్లి, కుటుంబ సభ్యులపై దాడులు చేస్తున్నారు. మూడేళ్లవుతున్నా సమస్య అలానే ఉండిపోవడంతో న్యాయం చేయాలని జవాన్ చౌడేష్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. దేశం కోసం పాటుపడుతున్న తన ఆస్తులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. విచారణ చేపట్టి.. న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

సజావుగా పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

పుట్టపర్తి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. జిల్లాలో 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం సాంఘిక శాస్త్రం పరీక్షకు 2,911 మంది విద్యార్థులకు గాను 2,466 మంది హాజరయ్యారని తెలిపారు. 445 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షల చీఫ్ అశ్వర్థరెడ్డి ఎనుములపల్లి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ నెల 28వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయి.

జూన్‌లో గృహ ప్రవేశాలు లేనట్టే!

- పూర్తి కాని టిడ్కో ఇళ్ల నిర్మాణం
- మౌలిక సదుపాయాలూ నిల్
- సొంతింటి కల మరింత ఆలస్యం



కదిరి శివారులోని హిందూపురం రోడ్డు పక్కన ఉన్న టిడ్కో భవనాల సముదాయం

కదిరి అర్బన్: టిడ్కో గృహనిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హామీతో జూన్‌లో గృహప్రవేశాలు చేయొచ్చని లబ్ధిదారులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. 2017లో కదిరి మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులకు చెందిన దాదాపు 3వేల మంది పేదలకు కదిరి–హిందూపురం రోడ్డు పక్కన టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. ప్రస్తుతం 75 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేసి పేదలకు అందిస్తామని చెప్పారు. ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఏడేళ్లుగా ఈ భవనాలు పాడుబడిపోయాయి. గృహాలకు సంబంధించిన మెటీరియల్ చాలావరకు చోరీకి గురయింది.

పనులు పూర్తయ్యేదెన్నడో..?

పట్టణ శివారులోని కదిరి– హిందూపురం రహదారికి ఆనుకుని 40 ఎకరాల విస్తీర్ణంలో టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం జరుగుతోంది. 75 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా భవనాల్లో విద్యుత్, ఉడ్ వర్క్, పెయింటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. వీధిలైట్లు, డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఎనిమిదేళ్లయినా పనులు పూర్తి కాకపోవడంతో ఆ ప్రాంతం పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. భవనాలు విషసర్పాలకు ఆవాసంగా మారిపోయాయి.

త్వరగా గృహాలు అప్పగించాలి



టిడ్కో ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందివ్వాలి. ఇళ్ల నిర్మాణాల పూర్తి కోసం సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేపట్టాం. అయినా పనుల్లో వేగం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి గృహనిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలి.

– నరసింహులు, సీపీఎం పట్టణ కార్యదర్శి

మరింత సమయం పట్టొచ్చు



ప్రస్తుతానికి టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై మాకు ఎలాంటి సమాచారమూ లేదు. 75 శాతం పూర్తయిన ఇళ్లను మిగిలిన 25 శాతం ఈ ఏడాది జూన్‌కు ఒక ఫేజ్, అక్టోబర్‌కు 2వ ఫేజ్‌లో పూర్తి చేసి ఇవ్వాలని గతేడాది రాష్ట్ర పురపాలక శాఖామంత్రి నారాయణ మున్సిపల్ కమీషనర్‌లతో నిర్వహించిన సమావేశంలో చెప్పారు. ఇవి ఫైనల్ స్టేజ్‌లో ఉన్న భవనాలకు మాత్రమే. ఫైనల్ స్టేజ్ జాబితాలో కదిరి లేదు. ఇంకా సమయం పట్టచ్చు.

– కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

సౌదీలో ధర్మవరం వాసి అవస్థలు

- ఉద్యోగం పేరిట ఏజెంట్ మోసం
- డ్రైవర్ జాబ్ అని.. ఇంటి పనికి కుదిర్చిన వైనం
- పని చేయలేక యజమానుల చేతిలో చిత్రహింసలు



సయ్యద్ ఫరూఖ్

ధర్మవరం అర్బన్: బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లిన ఓ వ్యక్తి ఏజెంట్ చేసిన మోసం వల్ల ఇబ్బందుల్లో పడ్డాడు. డ్రైవింగ్ కోసమని వెళ్తే ఇంటి పనుల్లో కుదిర్చారు. ఇంటి పనులు సరిగా చేయడం లేదని యజమానులు వీసా లాగేసుకుని.. చిత్రహింసలకు గురిచేస్తున్నారు. తన భర్తను రక్షించాలని భార్య ధర్మవరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు... బోయవీధికి చెందిన సయ్యద్ ఫరూఖ్, హర్షియా భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. ఉపాధి కోసం సౌదీకి వెళ్లేందుకు పుట్టపర్తికి చెందిన ఏజెంట్ ఖలీల్‌ను సంప్రదించాడు. డ్రైవింగ్ పని ఇప్పిస్తానని చెప్పి అతని నుంచి ఏజెంట్ రూ.1.40 లక్షలు తీసుకున్నాడు.

వీసాలో మోసం..

డ్రైవింగ్ వీసా స్థానంలో ఏజెంట్ 'ఫ్రీ వీసా' ఇచ్చి ఈ ఏడాది ఏప్రిల్ 23న ఫరూఖ్‌ను విమానంలో సౌదీకి పంపించాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో దిగిన ఫరూఖ్‌ను తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఏజెంట్‌ను ఫోన్‌లో సంప్రదించాడు. ఏజెంట్ మరో వ్యక్తిని ఫరూఖ్ దగ్గరకు పంపించాడు. అతను ఫరూఖ్‌ను తీసుకెళ్లి వాళ్లకు సంబంధించిన పెద్ద భవనాల్లో శుభ్రం చేసేందుకు, ఇంటి పనులు చేసేందుకు నియమించాడు. తాను డ్రైవింగ్ పని కోసం వచ్చానని, ఇంటి పనులు చేయనని మొండికేయడంతో ఆగ్రహించిన యజమానులు అతని వద్దనున్న ఫ్రీవీసా లాక్కున్నారు. బెల్టు, స్టీల్ పైపులతో చితకబాదేవారు. రోజూ మూడు, నాలుగు అంతస్తులున్న భవనాలను శుభ్రం చేసినా.. చిన్నపాటి దుమ్ము, ధూళి కనిపిస్తే యజమానులు మరోసారి శుభ్రం చేయించేవారు.

జరిమానా విధించిన సౌదీ ప్రభుత్వం

ఓ రోజు ఇంటి పనులు ముగించుకుని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన గదికి నడుచుకుంటూ వెళ్తున్న ఫరూఖ్‌ను సౌదీ పోలీసులు అదుపులోకి తీసుకుని, వీసా లేదని కేసు నమోదు చేశారు. 20 వేల దినార్లు (రూ.4.50 లక్షలు) జరిమానా విధించారు. ఆ డబ్బు చెల్లించాలని పోలీసులు ఒత్తిడి చేయడంతో ఫరూఖ్ తన భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ప్రస్తుతం సౌదీలోని మదరసాలో ఉంటున్నానని తెలిపాడు.

భర్తను విడిపించాలని వేడుకోలు

సౌదీలో బందీ అయిన తన భర్తను విడిపించడంతో పాటు వీసా పేరిట మోసం చేసిన ఏజెంట్ ఖలీల్‌పై చర్యలు తీసుకోవాలని ఫరూఖ్ భార్య హర్షియా సోమవారం ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఏజెంట్ ద్వారా ఫరూఖ్‌ను ఇండియాకి రప్పిస్తామని సీఐ హామీ ఇచ్చారు. అనంతరం ఫరూఖ్ కుటుంబ సభ్యులు మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యను విన్నవించారు. స్పందించిన మంత్రి కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్‌కు లేఖ రాసి.. ఫరూఖ్‌ను కాపాడాలని, అతని పాస్‌పోర్టును తిరిగి అందించాలని, భారత దౌత్య కార్యాలయం ద్వారా నిరంతర కమ్యూనికేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఇదెక్కడి న్యాయం..?

- విద్యార్థుల సంఖ్య తగ్గించిన వారికి 7 అదనపు పాయింట్లు
- గందరగోళంగా మారిన ఉపాధ్యాయుల బదిలీలు
- నేటితో ముగియనున్న ఎస్జీటీల దరఖాస్తుల గడువు



కదిరి: కష్టపడి పాఠాలు చెప్పి బడిలో విద్యార్థుల సంఖ్య పెంచిన వారి కన్నా.. విధులకు డుమ్మా కొడుతూ ఆ పాఠశాలలో పిల్లల సంఖ్య తగ్గి పోవడానికి కారణమైన ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఈ బదిలీల్లో 7 అదనపు పాయింట్లు కేటాయిస్తోంది. మరోవైపు బాగా పాఠాలు చెప్పి పిల్లలతో పాటు వారి తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంటున్న ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేస్తోంది. దీన్ని మెజార్టీ ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గిపోవడానికి కారణమైన ఉపాధ్యాయులకు పనిష్మెంట్ ఇవ్వకుండా ఇలా అదనపు పాయింట్లు కేటాయించడమేంటని వారు మండిపడుతున్నారు. ఇలాంటి ఉపాధ్యాయులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు మూడు వేల మంది దాకా ఉన్నారని అధికారిక లెక్కలే చెబుతున్నాయి.

ఆన్‌లైన్ ద్వారానే బదిలీ ఉత్తర్వులు

బదిలీలకు దరఖాస్తు చేసుకున్న టీచర్లకు ఆన్‌లైన్ ద్వారానే ఉత్తర్వులు అందనున్నాయి. హెచ్ఎంలకు ఈ నెల 30న, స్కూల్ అసిస్టెంట్లకు జూన్ 4న, ఎస్జీ టీచర్లకు జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల కానున్నాయి. ఎస్జీటీల దరఖాస్తు ప్రక్రియ గడువు మంగళవారంతో ముగియనుంది. ఈ నెల 31న ఎస్జీటీల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా విడుదల కానుంది. ఈ జాబితాపై అభ్యంతరాలను ఎస్జీటీలు ఈ నెల 28 నుంచి జూన్ 1లోగా తెలియజేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. బదిలీలకు సంబంధించి పాఠశాల ఎంపికకు హెచ్ఎంలు ఈ నెల 28లోగా, స్కూల్ అసిస్టెంట్లు జూన్ 1, 2వ తేదీల్లో, ఎస్జీటీలు జూన్ 7 నుంచి 10వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా ఆప్షన్స్ ఇచ్చుకోవాలి. టీచర్స్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్–2025 ప్రకారం ప్రభుత్వం ప్రస్తుతం ఈ బదిలీలు చేపడుతోంది. ఎస్జీ టీచర్లకు ఆఫ్‌లైన్ ద్వారానే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వం ముందుగా పేర్కొన్నప్పటికీ.. దీనిపై ఇప్పటి దాకా అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

సాంకేతిక చిక్కులు

బదిలీల ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు ఉపాధ్యాయులను ఆందోళనకు, గందరగోళానికి గురి చేస్తున్నాయి. దీనిపై తమకు జరిగిన అన్యాయాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదిస్తే తమ పరిధిలో ఏమీ లేదని, రాష్ట్ర కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని పలువురు టీచర్లు వాపోతున్నారు. దరఖాస్తు చేసే సమయంలో తమకు స్టేషన్ పాయింట్లు రావడం లేదని కొందరు, స్పౌజ్ పాయింట్ల విషయంలోనూ సమస్యలున్నాయని ఇంకొందరు అంటున్నారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నేతలతో జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను అమలు పరచాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

వ్యవసాయ శాఖలో 'బదిలీల జాతర'



అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్ సమక్షంలో అధికారుల ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ హాజరైన నాలుగు ఉమ్మడి జిల్లాల ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ శాఖలో సోమవారం బదిలీల జాతర జరిగింది. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన జోనల్‌స్థాయి కౌన్సెలింగ్‌కు రాయలసీమ నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్, సిఫారసుల కింద కూడా కొందరు ఉద్యోగులు హాజరయ్యారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో అర్హత కలిగిన 31 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు సూపరింటెండెంట్లు, 19 మంది ఏడీఏలు, 118 మంది ఏఓలతో పాటు 120 మందికి పైగా రిక్వెస్ట్ కింద బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు చెందిన అడిషినల్ డైరెక్టర్ శ్రీధర్ సమక్షంలో అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, నాగేశ్వరరావు, చంద్రానాయక్, మురళీకృష్ణ, వరలక్ష్మి, ప్రసాదరావు, జే.మురళీకృష్ణతో పాటు ఆయా జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, సూపరింటెండెంట్లు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. కాగా, కౌన్సెలింగ్ జరుగుతున్న తీరుపై కొందరు ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు కొందరివి పరిగణలోకి తీసుకుంటున్నా... మరికొందరివి తీసుకోవడం లేదన్నారు. అలాగే తమ విన్నపాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని కొందరు అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పశుశాఖలో..

స్థానిక పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి జిల్లా పరిధిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్స్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు డ్రైవర్లు, 23 మంది ఆఫీస్ సబార్డినేట్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, ఆఫీస్ మేనేజర్, సూపరెండెండెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో రాగల మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ద్వారా సమాచారమం అందిందని కలెక్టర్ చేతన్ తెలిపారు. మంగళవారం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండల కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని కోరారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 08555 289039 నంబర్‌కు సమాచారం అందించవచ్చని తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి


మాట్లాడుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

ప్రశాంతి నిలయం: తాము చేస్తున్న పనితో సంబంధం లేకుండా అరకొర జీతాలు చెల్లిస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలిసి వినతి పత్రం అందజేసి, సమస్య వివరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 550 మంది తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్నారన్నారు. తమకు అరబిందో యాజమాన్యం చెల్లించే జీతం సరిపోవడం లేదన్నారు. గత 9 సంవత్సరాలుగా కేవలం రూ.8,800 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, ఈ వేతనంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోగలమని ప్రశ్నించారు. ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల వేతనం రూ.18,500 చెల్లించాలని, పీఎఫ్ వాటాను యాజమాన్యమే భరించాలని, చట్ట ప్రకారం వారాంతపు సెలవులతో పాటు జాతీయ సెలవులనూ అమలు చేయాలని కోరారు. ఆరోగ్య బీమాతో పాటు, విధులలో మరణించిన డ్రైవర్లకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలన్నారు.

పోక్సో కేసు నమోదు

రాప్తాడు: స్థానిక పంచాయతీ పరిధిలోని ముస్లీం మైనార్టీ కాలనీకి చెందిన ఓ బాలికను వేధింపులకు గురి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. కొన్ని నెలలుగా తమ కుమార్తెను ప్రేమ పేరుతో కదిరి మండలం బత్తలపల్లి గ్రామానికి చెందిన యువకుడు వేధిస్తున్నట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అక్కడంతా.. ఆ ఇద్దరే!

- దళారీ అవతారమెత్తిన సీనియర్ అసిస్టెంట్లు
- డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వసూళ్ల పర్వం
- ఏ పని కావాలన్నా.. వారి వద్దకు వెళ్లాల్సిందే
- ఆస్పత్రుల రెన్యూవల్ విషయంలో భారీగా దందా



సాక్షి, పుట్టపర్తి: ప్రజలు అనారోగ్యం బారిన పడితే వైద్యం చేసే ఆరోగ్య శాఖ జబ్బు బారిన పడింది. ఇద్దరు అసిస్టెంట్లు దళారీ అవతారమెత్తి.. వసూళ్లు చేస్తుండటం కలకలం రేపుతోంది. జిల్లా వ్యాప్తంగా క్లినిక్ మొదలు.. నర్సింగ్ హోం వరకు.. నెల, ఆరు నెలలు, ఏడాదికి చొప్పున టార్గెట్ పెట్టుకుని మరీ వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సెలవు కావాలన్నా.. ఎఫ్ఆర్ఎస్ నమోదు కావాలన్నా.. ముడుపులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి. కొత్త ఆస్పత్రుల రిజిస్ట్రేషన్.. పాతవి రెన్యూవల్స్‌తో పాటు తనిఖీ చేయకుండా ఉండాలన్నా.. అడిగినంత సమర్పించుకోవాల్సిందే.

అసిస్టెంట్‌లే.. దళారీలుగా..

ఎఫ్ఆర్ఎస్ నమోదు నుంచి సెలవులకు అనుమతులు.. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ వరకు.. ప్రతి విషయంలో ఆ ఇద్దరు అసిస్టెంట్‌లు దళారీలుగా మారి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారికి పైసలు పంపనిదే.. ఫైలు కదలని పరిస్థితి. ఎఫ్ఆర్ఎస్, సెలవులన్నీ.. ఓ అసిస్టెంట్‌కు.. రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ విషయంలో మరో అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరి పేర్లు ఒకటే కావడంతో.. ఎవరైనా ప్రశ్నిస్తే.. ఒకరిపై మరొకరు చెప్పుకొంటూ పబ్బం గడుపుతున్నారు. పైగా తమపై ఎక్కడ ఫిర్యాదు చేసినా.. ఇబ్బంది లేదని.. కార్యాలయంలో ఖర్చులను తామే భరిస్తున్నామని.. ఎవరూ ఏమీ అనే ప్రసక్తే లేదని ప్రగల్భాలు పలుకుతున్నారు.

విజయవాడకు చేరిన పంచాయితీ

ఓ సీనియర్ అసిస్టెంట్ నిర్వాకంపై కొందరు మెడికల్ ఆఫీసర్లు పక్కా ఆధారాలతో జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. ఎలాంటి చర్యలూ లేకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు విన్నవించారు. ఆ తర్వాత నేరుగా విజయవాడలోని కమిషనర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై విజయవాడ నుంచి అధికారులు సీరియస్ కావడంతో పాటు డీఎంహెచ్‌ఓపై కలెక్టర్ కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వైద్య ఆరోగ్య శాఖలో జరిగే విషయాలపై ఎందుకు స్పందించకుండా ఉన్నారని.. వెంటనే విచారణ చేయించి.. నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

- ఇదిలా ఉండగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లలో ఒకరిపై శాఖాపరమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఒకరిని సోమవారం కడప రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) వద్ద సరెండర్ చేశారు. మరొకరిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోంది.

విచారణ చేస్తున్నాం

కొందరు మెడికల్ ఆఫీసర్లు ఓ సీనియర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తే.. ఆయనను ఆ విధుల నుంచి తప్పించాను. ఆ తర్వాత విజయవాడకు ఎవరు ఫిర్యాదు చేశారనే దానిపై విచారణ జరుగుతోంది. అవన్నీ తప్పుడు మెయిల్స్‌గా అనుమానం ఉంది. ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదు. కార్యాలయంలో ఖర్చులకు ప్రభుత్వమే భరిస్తుంది. ఖర్చుల కోసం సిబ్బందితో వసూళ్లు చేయడం లేదు.

– డాక్టర్ ఫైరోజాబేగం, డీఎంహెచ్‌ఓ

ప్రమాదంలో మెకానిక్ మృతి


మృతుడు నవీన్‌కుమార్

ధర్మవరం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన జయరాములు కుమారుడు నవీన్‌కుమార్ కారు మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య కీర్తన ఉన్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆయన చిగిచెర్ల రోడ్డులో అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల నిరసన


డీఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగంకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ ఎల్‌డీ కంప్యూటర్స్ సిబ్బంది సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లతో పని భారం పెరుగుతోందని, దీంతో ఒత్తిళ్ల కారణంగా తప్పిదాలు చోటు చేసుకుంటే కంప్యూటర్ ఆపరేటర్లను బాధ్యులను చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఉద్యోగుల పరిధిలో ఉన్న పనులను మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫిరోజ్‌బేగంకు వినతి పత్రం అందజేశారు.

పదోన్నతుల ఖాళీలు తగ్గించొద్దు

- డీఈఓను కోరిన ఉపాధ్యాయులు


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఖాళీలు తగ్గించరాదని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలోని శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేసి, డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. 2023లో తాత్కాలిక పదోన్నతులకు సంబంధించి ఎస్ఏ ఇంగ్లిష్‌లో 230 మందికి అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చేపట్టిన పదోన్నతులలో అంతకు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యుడు, నాగభూషణ, కేశవరెడ్డి, జయరాం నాయక్, సిరాజుద్దీన్, శ్రీనివాసులు నాయక్, శ్రీదేవి, విజయశ్రీ, సురేష్, కృష్ణారెడ్డి, పీరూనాయక్, వన్నారెడ్డి, సూర్యనారాయణ, క్షీరలింగేశ్వర్, వెంకటేష్, రసూల్, ఓబిరెడ్డి, నరసింహులు, విశ్వనాథరెడ్డి, రాజశేఖర్, శివప్రసాద్, మధు, రమేష్ పాల్గొన్నారు.

పోలీసులు న్యాయం చేయడం లేదు


బాధితురాలి అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ రత్న


డీఎస్పీకి అందజేసిన వినతిని చూపుతున్న బాధితుడు చెన్నకేశవులు

- కోర్టు తీర్పు అనుకూలంగా ఉన్నా టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితుడు చెన్నకేశవులు వినతి

పుట్టపర్తి టౌన్: కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉన్నా.. పోలీసులు మాత్రం న్యాయం చేయడంలేదంటూ డీఎస్పీ విజయకుమార్ ఎదుట బాధితుడు చెన్నకేశవులు వాపోయాడు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేసి, తన సమస్య వివరించారు. వివరాలు... కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన చెన్నకేశవులు, విజయలక్ష్మి దంపతులకు అదే గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51, 552, 553, 836, 837లో 8.70 ఎకరాల భూమి ఉంది. ఇందులో 550 మామిడి చెట్లతో పాటు వరి సాగు చేస్తున్నారు. 2005లో చెన్నకేశవులు అన్న రమణ మృతి చెందాడు. ఆయన పేరున ఉన్న భూమిని 2007లో చెన్నకేశవులు, విజయలక్ష్మి పేరుతో కొనుగోలు చేశారు. అయితే భూమిలో తమకూ హక్కు ఉందని అన్న కుమారుడు రెడ్డి కుమార్, బంధువులు రెడ్డెమ్మ, రెడ్డెప్పరెడ్డి అడ్డు తగలడంతో దీనిపై చెన్నకేశవులు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో చెన్నకేశవులుకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా దాయాదులు అడ్డుతగుతుండడంతో కోర్టు ఉత్తర్వులు నకళ్లను జతపరుస్తూ పోలీసులకు చెన్నకేశవులు ఫిర్యాదు చేశాడు. ఇందులో టీడీపీ నాయకులు జోక్యం చేసుకోవడంతో పోలీసులు చేతులెత్తేశారు. ఈ విషయంగా తమకు న్యాయం చేయాలంటూ డీఎస్పీ విజయకుమార్‌కు బాధితుడు చెన్నకేశవులు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన డీఎస్పీ వెంటనే కదిరి పీఎస్‌కు ఫోన్ చేసి, సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 70 వినతులు అందాయి. ఎస్పీ రత్న వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

బైక్ ఢీ – ఒకరి మృతి


మృతుడు లక్ష్మన్న

ముదిగుబ్బ: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగిస్తున్న నల్లచెర్లోపల్లికి చెందిన ఎం లక్ష్మన్న (59) సోమవారం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మలకవేమల సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో లక్ష్మన్నతో పాటు మరో ద్విచక్ర వాహనదారుడు శంకర్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో లక్ష్మన్న మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నక్కల గుట్టపై వ్యక్తి పుర్రె లభ్యం

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లి వద్ద ఉన్న నక్కల గుట్టపై ఓ గుర్తు తెలియని వ్యక్తి పుర్రెను సోమవారం గొర్రెల కాపరులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఉపాధిహామీ పనిలో భాగంగా నక్కల గుట్టపై తవ్విన గుంతలో పడి ఉన్న పుర్రె గమనించారు. పుర్రెపై ఏడు ఇంచుల పొడవుతో నల్లని వెంట్రుకలు ఉన్నాయి. బ్లూకలర్ ప్లాస్టిక్ సంచి, వైభవ్ జ్యువెలరీస్ లేబుల్ ఉన్న బ్యాగ్ అక్కడ పడి ఉన్నాయి. పుర్రె, ఇతర వస్తువులను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ నివేదిక అందిన తర్వాత పుర్రె పురుషునిదా? మహిళదా అనే విషయం నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

తలుపుల: వీధి కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి చెందాయి. వివరాలు... ముదిగుబ్బ గ్రామానికి చెందిన మల్లికార్జున గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన గొర్రెల మందను మేపు కోసం తలుపుల మండలం మాడికవాండ్లపల్లి సమీపంలోని సూర్యనారాయణరెడ్డి పొలంలో వదిలాడు. సోమవారం 30 గొర్రె పిల్లలను జార్లీ (గంప) కింద వేసి పెద్ద గొర్రెలను మేపునకు తోలుకెళ్లారు. ఆ సమయంలో వీధి కుక్కలు జార్లీలో చొరబడి బీభత్సం సృష్టించడంతో 25 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మరో ఐదు గొర్రెపిల్లల ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఘటనపై బాధిత కాపరి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

గణపతి సచ్చిదానంద స్వామి పుట్టినరోజు వేడుకలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గణపతి సచ్చిదానంద స్వామి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. గణపతి సచ్చిదానంద జ్ఞాన బోధ సభ ట్రస్ట్, వలంటీర్ల ఆధ్వర్యంలో సచ్చిదానంద స్వామి చిత్రపటాన్ని పల్లకీలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అనగాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దత్త శివ, మెటికల కుళ్లాయప్ప, రామంజనేయులు, సాగా సురేష్, రంగా శ్రీనివాసులు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పదోన్నతులకు నేడు సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని పాఠశాల సహాయకుల నుంచి గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలో ఉన్న టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. https://deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ సీనియార్టీ ఉంచినట్లు తెలిపారు. ఈ జాబితాలోని పీఎస్‌హెచ్‌ఎంలు/స్కూల్ అసిస్టెంట్లు తమ విద్యార్హత ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు కుల ధ్రువీకరణ పత్రాలు, పీహెచ్ టీచర్లు తమ ఒరిజనల్ విద్యార్హత పత్రాలతో పాటు మెడికల్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న శారదా బాలికల నగరపాలక ఉన్నత పాఠశాలలో చేపట్టిన పరిశీలన ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు.

హెర్బల్ పార్కుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీ మెడిషనల్ ఆరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు సీఈఓ చంద్రశేఖర్, అధికారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో హెర్బల్ పార్కు ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలిస్తున్నామని ఏపీ మెడిషనల్ ఆరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలో సోమవారం గాంధీనగర్, రామ్‌నగర్‌లో ఉన్న మున్సిపల్ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ స్థలాల్లో 58 రకాల ఔషధ మొక్కలతో ప్రత్యేక హెర్బల్ పార్కు ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఏర్పాట్ల కోసం స్థలాలను పరిశీలించేందుకు వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ నటరాజ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు పాల్గొన్నారు.

'మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందించాలి'

ముదిగుబ్బ: ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వైపునకు వెళ్లే ఎన్‌హెచ్ 342 జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారికి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఎకరానికి రూ.8,90,000 మాత్రమే చెల్లిస్తామని ప్రకటించారు. అయితే ఈ ప్రాంతంలో ప్రభుత్వ వ్యాల్యుయేషన్ ప్రకారం ఎకరానికి రూ, 63,88,000 ఉందన్నారు. వీటి ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు తహసీల్దార్ నారాయణ స్వామికి వినతిపత్రం అందజేశారు. మాకు పరిహారం అందించే వరకు పనులను నిలిపివేయాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్‌నాయుడు, రమేష్‌బాబు, సనత్‌కుమార్, విశ్వనాథ్, ప్రభాకర్ నాయుడు, హనుమంతు, అశోక్, రాగినాయుడు, ప్రసాద్, లక్ష్మీదేవి, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఇంట చోరీ

రొద్దం: మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన రైతు చాకిల క్రిష్టప్ప ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆర్డీటీ సౌజన్యంతో గ్రామంలో ఇంటిని నిర్మించుకుని అందులోనే నివాసముంటున్న క్రిష్టప్ప.. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాను ధ్వంసం చేసి, అందులోని రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారు నగలు, 12 తులాల వెండి సామగ్రి, రాగి పాత్ర అపహరించినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'యోగాంధ్ర' విజయవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్: పట్టణంలో ఈ నెల 28న నిర్వహించే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ జిల్లా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాగిరి రోడ్డుపై బుధవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఉంటుందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు హాజరయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం యోగాసనాలకు అవసరమైన ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు, డ్రోన్ ఏర్పాటు, పార్కింగ్, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయానంద్, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్ బేగం, క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్, సాంఘిక సంక్షేమ శాఖా అధికారి శివరంగప్రసాద్, బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలాజ్యోతి, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథగుప్త తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో యోగాంధ్ర, ఆయుష్ గ్రామం కార్యక్రమంలో భాగంగా అధికారులకు సిబ్బందితో పాటూ పలు పార్టీకు చెందిన రాజకీయ నాయకులతో యోగా కార్యక్రమం నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి: నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి. యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని కనుముక్కల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ రత్నచిరంజీవి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో యోగాపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తాయన్నారు. అనంతరం 10 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అలివేలు మంగమ్మ, ఏఎన్‌ఎం అనిత, ఆశావర్కర్లు గౌతమి, సరస్వతి, కాంపౌండర్లు నాగమణి, ఇంద్రావతి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల దోపిడీ అరికట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం: ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల దోపిడీని అరికట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్సీలో సోమవారం ఎంఈఓ రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్ రెడ్డి, గిరీష్ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభం కాకమునుపే అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఫీజు వివరాలు బహిర్గతం చేయాలని కోరారు. భవిష్యత్తులో పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ భూములు కేటాయించడం తగదు

తనకల్లు: మండలంలోని మల్లిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను ప్రైవేట్ సోలార్ కంపెనీకి కేటాయించడం తగదని పలు గ్రామాల ప్రజలు తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 63లో ఉన్న ప్రభుత్వ భూములను సోలార్ కంపెనీకి కేటాయించడానికి రెవెన్యూ అధికారులు చేసిన ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలన్నారు. ఆ భూములను సోలార్‌కు కేటాయిస్తే దాదాపు 15 గ్రామాలకు చెందిన పశువులకు మేత, నీరు ఉండదని తెలిపారు. కార్యక్రమంలో పెండ్లి గుండుతండా, జామ్లానాయక్ తండా, పెద్దపల్లి, ఎర్రబల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

Govt. ఆఫీస్ ఆటోమేషన్ కోర్స్
- ఫీజు 20% రాయితీతో ₹ 7,200. సీట్స్: 60, Q: 10th ఆపైన, లాస్ట్ డేట్: జూన్ 15, # సాయి ఇన్‌స్టిట్యూట్, ATP. 9059723829. [A-1631]

అడ్మిషన్స్
- ఇంటర్ పాస్ స్టూడెంట్స్ కి B.Sc. (నర్సింగ్). B.Sc (MLT), GNM (నర్సింగ్), DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్), గవర్నమెంట్ సీట్స్ కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. శ్రీ ఎడ్యుకేషన్. సంప్ర: G.మురళి, 9030661651, అనంతపురం. [A-1630]

REAL ESTATE

PLOT FOR SALE
- అరవకూరు దగ్గర బళ్లారి హైవేకి మొదటి బిట్టు, ఎయిర్ పోర్ట్ దగ్గర లోని 50 సెంట్స్ & 40 సెంట్స్ & 65 సెంట్స్ అమ్మకానికి కలవు. సెల్:8688397109. [A-1626]

FLAT FOR SALE
- 2BHK FLAT At Gokulam Residency, Hari Hara Temple Road, Ashok Nagar, Anantapur. Flat No:306, with car parking. Cell: 9849636046. [SCA25004261]

WANTED
- సోలార్ కంపెనీ నందు పనిచేయుటకు టెక్నీషియన్లు కావలెను. జీతం: 8–10 వేలు. స్పాట్ జాయినింగ్. సెల్: 8121766831, ATP. [SCA25004116]
- ATP బళ్లారి రోడ్ ప్రముఖ టైల్స్ షాప్ నందు సేల్స్ గర్ల్స్ కావలెను. Q: ఇంటర్ / డిగ్రీ. సంప్రదించండి సెల్: 9703836187, 8688633908. [SCA25004171]
- జాబ్స్ @ ATP. కాలేజ్ అడ్మిషన్స్ చేయుటకు మండలాల వారీగా M/F కావలెను. వర్క్ ఫ్రమ్ హోమ్ (F), పార్ట్ టైమ్ (F) జాబ్స్. Adress : Tower Clock, Anantapuramu. Cell: 9494585715, 9985832629. [A-1628]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]
- ప్రింటింగ్ ప్రెస్ నందు పనిచేయుటకు బైండర్స్/ ఆపరేటర్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. అనూ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, గుత్తి రోడ్డు, (ATP)సెల్ :7396967117 [SCA-25004161]
- Wanted Experienced Female Staff for NUR, LKG, UKG, PRIMARY CLASSES (I-V) ALL SUBJECTS, COMPUTERS & LUCIDA H.W DANCE & YOGA TO WORK IN BLOSSOMS SCHOOL ARAVIND NAGAR,ATP. MOB:9030777676 [SCA-25004159]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు, అమ్మకం, రియల్ ఎస్టేట్, ఫర్నిచర్, ఆటోమొబైల్, కంప్యూటర్స్, సర్వీసెస్, కావలెను
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

